నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 1 జూన్ 2024 | HYDERABAD

కీసర మండలం భోగారం కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

4న ఓట్ల లెక్కింపు

జిల్లాలో 16 కౌంటింగ్ కేంద్రాలు, ప్రతి హాల్‌లో 14 టేబుళ్లు

సిటీబ్యూరో, మే 31, (నమస్తే తెలంగాణ): లోక్ సభ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పారదర్శకంగా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. ఈ నెల 4న జరిగే హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికకు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు మొత్తం 16 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని సెగ్మెంట్లలో ఓట్ల లెక్కింపునకు ప్రతి హాల్ లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. ఇందులో అత్యధికంగా పోలింగ్ స్టేషన్లు ఉన్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు 20 టేబుళ్లు, మిగతా నియోజకవర్గంలో 14 టేబుళ్లు ఉండనున్నాయి. ఇక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌కు 10 టేబుళ్లు, హైదరాబాద్ పార్లమెంట్‌కు 14 టేబుళ్లు ఉంటాయి. లెక్కింపు ప్రక్రియలో 1000 మంది సిబ్బంది పాల్గొనున్నారు. 650 మంది లెక్కింపునకు అవసరం పడుతుండగా, దాదాపు 350 మందిని రిజర్వ్‌లో ఉంచుతున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, రౌండ్ల వారీగా కౌంటింగ్ జరుపనున్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

మేడ్చల్, మే 31(నమస్తే తెలంగాణ): కీసర మండలం భోగారం కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ కేంద్రాన్ని కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించి.. పలు సూచనలు చేశారు.

24 గంటలు.. ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ట్యాంక్‌బండ్‌పై నిర్వహిస్తుండటంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం అర్ధరాత్రి వరకు 24 గంటల పాటు ట్యాంక్ బండ్‌పైకి సాధారణ వాహనాల అనుమతి ఉండదని నగర ట్రాఫిక్ అదనపు సీపీ తెలిపారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి ట్యాంక్ బండ్ వైపు, రవీంద్రభారతి నుంచి ట్యాంక్‌బండ్‌పైకి, ఎన్టీఆర్ మార్గ్ నుంచి ట్యాంక్‌బండ్‌పైకి, జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్‌పైకి వచ్చే ఆయా రూట్లలోని వాహనాలను మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ అదనపు సీపీ వివరించారు.

శుక్రవారం ఆలియా ప్రభుత్వ పాఠశాలలో పనుల పురోగతిని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కౌంటర్లు తెరిస్తే కఠిన చర్యలే!

ప్రైవేటు స్కూళ్లకు విద్యాశాఖ అల్టీమేటం

పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ విక్రయానికి వీలులేదు

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు, స్కూల్ రిజిస్ట్రేషన్ రద్దు

డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, స్కూల్ ఇన్‌స్పెక్టర్లతో తనిఖీ బృందాలు

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : విద్యను వ్యాపారంగా మలిచే ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకునేందుకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, స్టేషనరీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకోనున్నారు. అధిక ధరలతో ప్రతి విద్యాసంవత్సరంలో సొమ్ము చేసుకుంటున్న స్కూళ్ల ఆగడాలకు బ్రేకులు వేయడానికి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, డిప్యూటీ స్కూల్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ బృందాలు సిద్ధమయ్యాయి. ప్రత్యేక కౌంటర్లు తెరిచి వ్యాపారం చేసే స్కూళ్లను గుర్తించి.. కేసులు నమోదు చేయడం, స్కూల్ అనుమతి రద్దు చేయడం వంటి తీవ్ర చర్యలు కూడా తీసుకోనున్నారు. ఎటువంటి స్కూళ్లల్లోనైనా విద్యకు సంబంధించిన సామగ్రి విక్రయించడానికి వీలు లేదని జిల్లా డీఈవో రోహిణి స్పష్టం చేశారు.

8వేలకు పైగా పాఠశాలలు..

నగరంలో సుమారు 8వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి. ప్రతి ఏడాది తల్లిదండ్రులకు పిల్లలను చదివించడం కత్తిమీద సాములా మారింది. ఎల్‌కేజీ అడ్మిషన్ డొనేషన్‌కు సైతం లక్షలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక ఫీజులు లక్షల్లో ఉంటే... ఇంతటితో ఆగకుండా కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు పిల్లలు ధరించే యూనిఫాంలు, రాసుకునే పెన్నులు, చదివే పుస్తకాలు, ఇతర స్టేషనరీ అంతా తామే అమ్ముతామని తమ దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు వేల రూపాయలు గుమ్మరించి.. యాజమాన్యాలు కొనుగోలు చేయమన్న ప్రతీది కొనాల్సిన పరిస్థితి వస్తున్నది. జూన్ వచ్చిందంటే పిల్లల చదువు, పుస్తకాల ఫీజులు గుర్తొచ్చి బెంబేలెత్తుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు స్కూళ్ల ఆగడాలను కొంతనైనా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు దృష్టి సారించడంపై పేరెంట్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

4లోపు పుస్తకాల పంపిణీ పూర్తవ్వాలి

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 4వ తేదీలోపు 11లక్షల పుస్తకాలు, 4.47 లక్షల నోట్‌బుక్స్‌ల పంపిణీ పూర్తవ్వాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ ఆలియా ప్రభుత్వ పాఠశాలలో పనుల పురోగతిని పరిశీలించారు. జూన్ 10 నాటికి అన్ని పాఠశాలలు సకల హంగులతో సిద్ధంగా ఉండేలా పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

మా దృష్టికి తీసుకురండి

చదువును అందించే విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకూడదు. స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, స్టేషనరీ ఏవీ కూడా విక్రయించడానికి వీలు లేదు. మా దృష్టికి వచ్చిన ప్రతి స్కూల్‌పై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మండల స్థాయిలో ప్రత్యేక టీంలను రంగంలోకి దించాం. జూన్ 1 నుంచే కొన్ని స్కూళ్లు పుస్తకాల విక్రయానికి సిద్ధమవుతున్నట్టు కొన్ని ఫిర్యాదులు అందాయి. వాటిపై మా నిఘా ఉంటుంది. కచ్చితంగా ఆ స్కూళ్లపై నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల సూచనలతో చర్యలు తీసుకుంటాం.

- రోహిణి, డీఈవో, హైదరాబాద్

20 లక్షల వరకు జరిమానా విధిస్తాం

ప్రైవేటు స్కూళ్లల్లో పుస్తకాలు, స్టేషనరీ విక్రయించడం నేరం. నిబంధనలు అతిక్రమిస్తే స్కూల్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం. అవసరమైతే 20 లక్షల వరకు జరిమానా విధిస్తాం. నిబంధనలు పాటించాలి. విద్యాసంస్థలు ఎప్పుడూ లాభపేక్ష లేకుండా కొనసాగాలి. జిల్లాలో ఏ స్కూల్లోనైనా పుస్తకాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

-సుశీంధర్‌రావు, డీఈవో, రంగారెడ్డి

క్యాంప్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దశాబ్దిని ఘనంగా నిర్వహిద్దాం

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 31: మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ ఆర్ఏసీఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గవ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. 1 నుంచి 3 వరకు కార్యక్రమాలు ఉంటాయని ఆమె వెల్లడించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు అమరవీరులకు నివాళులర్పిస్తూ.. కొవ్వొత్తుల ర్యాలీ, 2న సాయంత్రం 6 గంటలకు జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ఉన్న అమర వీరుల స్తూపం వద్ద అమర వీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం ఉంటుందన్నారు. 3న అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్ల పరిధిలో జాతీయ జెండాలతో పాటు బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించాలన్నారు.

నాలాల పరిశీలనలో బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్ తదితరులు

స్పందించి.. పరిశీలించి

నమస్తే ఎఫెక్ట్

బేగంపేట, మే 31: నాలాల్లో పూడిక, చెత్త తొలగించకపోవడంతో వరద ముప్పు పొంచి ఉన్నదంటూ.. 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి బేగంపేట సర్కిల్ బల్దియా అధికారులు స్పందించారు. దుర్గంధ భరితంగా మారిన బేగంపేటలోని ధనియాలగుట్ట, కట్టమైసమ్మ దేవాలయం వెనుక ఉన్న నాలాలను బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, ఇంజినీరింగ్ విభాగం ఈఈ సుదర్శన్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. నాలాల్లో వ్యర్థాల తొలగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. సోమవారం నాలాల్లో వాహనాలను దింపి వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తామని ఈఈ సుదర్శన్ తెలిపారు.

బేగంపేట జలమండలి కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ఎక్స్‌టెన్షన్ బస్తీ మహిళలు

ఖాళీ బిందెలతో నిరసన

బేగంపేట, మే 31: బేగంపేట డివిజన్‌లోని ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బస్తీలో కొంతకాలంగా తాగునీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో బస్తీ మహిళలు శుక్రవారం బేగంపేటలోని జలమండలి సెక్షన్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వెంటనే స్పందించిన అధికారులు.. బస్తీలో పర్యటించి సమస్యను గుర్తించారు. రెండు రోజుల్లో పైపులైన్‌లో ఏర్పడిన సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే బస్తీలో 90 శాతం మంది మోటర్లు బిగించి నల్లా నీటిని లాగేస్తుండటంతో మిగతా వారికి లో ప్రెషర్‌తో నీళ్లు వస్తున్నట్టు గుర్తించారు. మోటర్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

మల్కాజిగిరి, మే 31: కాజీపేట నుంచి సనత్‌నగర్‌కు 59 బోగీలతో బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు శుక్రవారం ఉదయం ఉప్పరిగూడ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద పట్టాలు తప్పింది. నాలుగు బోగీలు ఎడమ వైపునకు ఒరిగిపోయాయి. రైల్వే సేఫ్టీ అధికారులు ఘటనా స్థలికి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టారు. పట్టాలు తప్పిన బోగీలను తొలగించి.. రైలును పంపించారు. ఈ ప్రమాదంపై రైల్వే అధికారులు దర్యాప్తు చేపట్టారు.

6 నుంచి సదరం క్యాంపులు

మేడ్చల్ కలెక్టరేట్, మే 31 : జిల్లాలోని మల్కాజిగిరి ప్రభుత్వ వైద్యశాలలో జూన్ 6 నుంచి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 6, 13, 14, 20, 21, 27వ తేదీల్లో సదరం క్యాంపులు ఉంటాయన్నారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు మీ సేవ ద్వారా బుక్ చేసుకున్న సదరం స్లాట్ రశీదు, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో, తాజా మెడికల్ రిపోర్టులతో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. శనివారం నుంచి సదరం స్లాట్స్ మీ సేవలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

ఇకపై tgsouthernpower.org

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.(https://tssouthernpower.com) పేరుతో ఉన్న వెబ్‌సైట్ ఇక నుంచి (https://tgsouthernpower.org/)గా మార్పు చేశారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి.. ఆన్‌లైన్‌లో విద్యుత్ శాఖ సేవలను పొందేందుకు కొత్త వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను బుక్ మార్క్ చేసుకొని వినియోగించాలని అధికారులు సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన అన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్న నేపథ్యంలో కొత్త వెబ్‌సైట్ వివరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే సేవలు పొందాలని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

చేప మందుకు.. రెండు లక్షల కొర్రమీనులు..

సుల్తాన్‌బజార్, మే 31: ప్రతి ఏటా మృగశిర కార్తె రోజున ఆస్తమా రోగుల కోసం బత్తిని కుటుంబం చేప మందును పంపిణీ చేస్తున్నది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరపున మత్స్యశాఖ పూర్తి సహకారం అందిస్తూ వస్తున్నది. ఈ ఏడాది కూడా బత్తిని కుటుంబం చేప మందు పంపిణీకి సన్నద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో నల్గొండ, ఏపీలోని ఏలూరు, వెస్ట్ గోదావరి జిల్లాల నుంచి కొర్రమీను చేప పిల్లలను తీసుకొస్తున్నట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఒక్కో కొర్ర మీను ధర రూ. 40 ఉంటుందన్నారు. కార్యక్రమం ప్రారంభరోజైన 8న ఉదయం 6 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి కొర్రమీను చేప పిల్లలను తీసుకొస్తామన్నారు.



రాష్ట్ర అవతరణ వినోత్సవాన్ని పురస్కరించుకొని..ట్యాంక్ బండ్ ప రిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ కార్యక్రమాల కోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చిత్రంలో విద్యుద్దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్న సచివాలయం, అమరవీరుల స్మృతి చిహ్నం

48 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ): పశ్చిమ దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 30 డిగ్రీలకు చేరువకావడంతో నగర వాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 41.0, కనిష్ఠం 29.7 డిగ్రీలు, గాలిలో తేమ 31 శాతంగా నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాగల 48 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు.

అధిక ఉష్ణోగ్రతల కారణంగా క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి, సాయంత్రం లేదా రాత్రి వేళలో వానలు కురిసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు.